క్లుప్తంగా

కంటి వైద్యశిబిరం పునఃప్రారంభం

కాగజ్‌నగర్‌టౌన్: స్థానిక కిమ్స్ ఆసుపత్రిలో ప్రతీ మంగళవారం కొత్తపల్లి వెంకటలక్ష్మి –చంద్రయ్య మెమోరియల్ సేవా సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని తిరిగి ప్రారంభిస్తున్నట్లు సేవా సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ ఒక ప్రకటనలో శుక్రవారం తెలిపారు. అర్హులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఆపరేషన్లు అవసరమైన వారికి ఉచితంగా చేయిస్తామని పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

సిర్పూర్(టి): మండలంలోని భూపాలపట్నం గ్రామ శివారులో పొలం పనులకు వెళ్లిన రైతు టాకిరే బిక్కు పిడుగుపడి ఇటీవల మృతి చెందగా కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈసందర్భంగా కుటుంబానికి వారి ప్రగాఢ సానుభూతి తెలిపారు. టీపీసీసీ సభ్యుడు కోర్లక కృష్ణారెడ్డి ఆర్థిక సాయం అందించారు. పరామర్శించిన వారిలో డీసీసీ ఓబీసీ చైర్మన్, రాజీవ్ గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ జిల్లా కో ఆర్డినేటర్ దాసరి వెంకటేష్, సిర్పూర్ మండల నాయకులు ఫాహద్ అహ్మద్, చిలివేరి శ్రీను పాల్గొన్నారు.

పఠనోత్సవం పకడ్బందీగా నిర్వహించాలి


పఠనోత్సవాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కౌటాల: ప్రభుత్వ పాఠశాలల్లో పఠనోత్సవ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని ఎఫ్ఎల్ఎన్ మండల అధికారి గావుడే హన్మంతు అన్నారు. శుక్రవారం మండలంలోని గుండాయిపేట్, తుమ్మిడిహెట్టి, వీర్దండి, మొగడ్దగడ్, భాలేపల్లి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో పఠనోత్సవ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదవడం, రాయడం, మాట్లాడడం, వినడంలో ఆసక్తి కలిగి ఉండాలన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు మెరుగైన బోధన అందించాలని పేర్కొన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట సీఆర్పీ రవికుమార్, హెచ్ఎంలు ఉన్నారు.

‘ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు గుణపాఠం చెప్పాలి’


మాట్లాడుతున్న బీఎస్పీ నాయకులు

కాగజ్‌నగర్‌టౌన్: జిల్లా వాసులను మోసం చేస్తున్న సీఎం కేసీఆర్‌కు, బీఆర్ఎస్‌కు ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి సిడాం గణపతి, రాష్ట్ర కార్యనిర్వాహక కమిటీ కార్యదర్శి అర్షద్ హుస్సేన్‌లు అన్నారు. శుక్రవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. పోడు భూముల పట్టాలు గిరిజనులతో పాటు గిరిజనేతరులకు ఎప్పుడు ఇస్తారని ప్రశ్నించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన మిషన్ భగీరథ పథకం గాలిలో దీపంలా మారిందని విమర్శించారు. సమావేశంలో పార్టీ కాగజ్‌నగర్ పట్టణ అధ్యక్షుడు నక్క మనోహర్, నాయకులు అరుణ్, శ్రీనివాస్, ముక్తార్ తదితరులు పాల్గొన్నారు.

‘దళితులను మోసం చేస్తున్న సీఎం’


మాట్లాడుతున్న జయరాజ్

ఆసిఫాబాద్‌అర్బన్: దళితులకు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చకుండా సీఎం కేసీఆర్ దళితులను మోసం చేస్తున్నారని బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు జయరాజ్ మండిపడ్డారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా సీఎం జిల్లా పర్యటనకు ఎలా వస్తారని ప్రశ్నించారు. భవిష్యత్తులో బీఆర్ఎస్‌కు ప్రజలు ఓటు ద్వారా బుద్ధి చెబుతారన్నారు.

బీఆర్ఎస్‌లోకి కాంగ్రెస్ నాయకుడు రామయ్య

కాగజ్‌నగర్‌రూరల్: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గజ్జి రామయ్య శుక్రవారం సీఎం కేసీఆర్ సమక్షంలో గులాబీ కండువా కప్పుకున్నారు. గజ్జి రామయ్య గతంలో సర్పంచ్‌గా, ఎంపీపీగా, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పనిచేశారు. ఎన్నో ఏళ్లుగా కాంగ్రెస్‌లో కొనసాగిన ఆయన సీఎం పర్యటన నేపథ్యంలో బీఆర్ఎస్‌లో చేరడం ప్రాధాన్యం సంతరించుకుంది. అదేవిధంగా భట్‌పల్లి గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు మిలింద్ కూడా బీఆర్ఎస్ పార్టీలో చేరారు.

మొలకెత్తిన ఆశలు

- ఆశాజనకంగా పత్తిసాగు
- మండలంలో ఇప్పటికే విత్తుకున్న రైతులు
- ముసురు వానలతో మొలకెత్తుతున్న విత్తనాలు


గంగాపూర్ సమీపంలో పత్తి విత్తనాలు విత్తుతున్న కూలీలు


నంబాలలో మొలకెత్తిన పత్తి విత్తనాలు

రెబ్బెన: ఈ ఏడాది వానాకాలం సీజన్‌లో పత్తి పంట ఆశాజనకంగా సాగవుతుంది. రుతుపవనాల ఆగమనం కాస్త ఆలస్యం కావటంతో ఆందోళనలో పడ్డ మండల రైతులకు ఇటీవల కురిసిన భారీ వర్షం ఊరటనిచ్చింది. పొడిదుక్కిలో విత్తనాలు విత్తుకోగా ముసురు వానలతో పత్తి మొలకలు వస్తున్నాయి. మండలంలో 60శాతం విత్తనాల విత్తే ప్రక్రియ పూర్తయింది. మిగతా చోట్ల, వేసవిలో దుక్కిదున్ని పత్తి చేలలో విత్తనాలు విత్తుకున్నారు. నాలుగు రోజుల క్రితం కురిసిన వర్షాలకు మొలకెత్తుతుండడంతో పలువురు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కొన్నిచోట్ల విత్తనాలు మొలకెత్తని స్థానంలో కొత్తవి పెడుతూ సాగు పనుల్లో రైతులు బిజీగా మారారు.

పెరిగిన విత్తనభారం

మండలంలో ఈసారి గతంలో కన్న ఎక్కువగా రైతులు పత్తి వైపే మొగ్గుచూపారు. ఆ తర్వాత కంది, ఇతర పంటలు సాగు చేయనున్నారు. ఈసారి పత్తి రైతులు పెరిగిన విత్తన భారం మోయక తప్పడం లేదు. 450 గ్రాముల బరువు ఉన్న విత్తన ప్యాకెట్ గతేడాది ధర రూ.810గా ఉంది. సీజన్‌కు ముందు రాష్ట్ర ప్రభుత్వం రూ.43 పెంచడంతో రూ.853 అయ్యింది. డిమాండ్ ఉన్న విత్తనాలను కొన్ని ఫర్టిలైజర్ షాపుల యజమానులు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ప్యాకెట్‌ను గరిష్ఠంగా రూ.1250 వరకు విక్రయిస్తున్నట్లు సమాచారం. మండలంలో సుమారు 25వేల ఎకరాల వరకు పత్తి సాగవుతుండగా, 50వేల విత్తనాలు అవసరం. ఈ లెక్కన రైతులు సుమారు రూ.10.75 లక్షల అదనపు భారం మోయాల్సి వస్తోంది. ఇప్పటికే పలువురు రైతులు విత్తనాలు కొనుగోలు చేయగా, మరికొందరు రైతులు పత్తి సాగుకు అవసరమైన విత్తనాలను కొనుగోలు చేసి సిద్ధంగా ఉంచుకున్నారు.

మొలకశాతం బాగుంది



ముసురు వానలతో ముందుగా వేసిన పత్తి విత్తనాల్లో మొలకశాతం బాగుంది. వర్షాల రాకను బట్టి రైతులు విత్తుకోవడంతో విత్తనాలు మొలుకెత్తుతాయి.

– మంజుల, ఏవో

అభివృద్ధికి ఆమడదూరంలో ‘పూసిగూడ’


చీలపెల్లి -పూసిగూడ మధ్యలోని వాగు

- రోడ్డు సౌకర్యం, తాగునీరు లేక తిప్పలు
- వర్షాకాలంలో రాకపోకలు బంద్


అటవీప్రాంతం గుండా పూసిగూడ రోడ్డు

సిర్పూర్(టి): మండలంలోని చీలపెల్లి గ్రామపంచాయతీ పరిధి పూసిగూడ గిరిజన గ్రామంలో కనీస వసతులు లేక ప్రజలు నానాపాట్లు పడుతున్నారు. మండల కేంద్రానికి 12 కిలోమీటర్ల దూరంలో, దట్టమైన అటవీప్రాంతంలో గ్రామం ఉంది. గ్రామానికి వెళ్లేందుకు రోడ్డు, తాగేందుకు నీటి సౌకర్యం కూడా లేదంటే అతిశయోక్తి కాదు. వర్షాకాలంలో వాగు దాటలేక వారు పడుతున్న అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి. గ్రామంలో 50 ఇళ్లు ఉండగా సుమారు 240కి పైగా జనాభా ఉంది.

అనేక ఇబ్బందులు..

గ్రామంలో తాగునీటి వసతి కోసం మిషన్ భగీరథ ట్యాంకు నిర్మించినా నీటి సరఫరా మాత్రం జరగడం లేదు. తాగునీటి సౌకర్యం లేకపోవడంతో గ్రామంలో ఉన్న చేతి పంపు నీటినే గ్రామస్తులు తాగుతున్నారు. చీలపెల్లి నుంచి గ్రామానికి కనీసం రోడ్డు కూడా నిర్మించకపోవడంతో ఏటా వర్షాకాలంలో గ్రామస్తులు పడే ఇబ్బందులు వర్ణనాతీతంగా ఉన్నాయి. చీలపెల్లి గ్రామం నుంచి పూసిగూడ గ్రామం వెళ్లే మార్గంలో రెండు వాగులున్నాయి. చీలపెల్లి గ్రామ సమీపంలో పెద్దవాగు ఉండటంతో వాగు ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు వాగు దాటేందుకు ప్రజలు అనేక అవస్థలు పడుతుంటారు. అత్యవసర సమయాల్లో, అనారోగ్యాలకు గురైతే వాగు దాటలేక ప్రాణాలు పోయిన సందర్భాలు కూడా ఉన్నాయి. గ్రామంలో ఏటా వర్షాకాలంలో ప్రాణాలు పోతున్నా అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్యే, ఎంపీ, ఐటీడీఏ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం ఉండడంలేదని వాపోతున్నారు.

వాగు దాటలేక ప్రాణం పోయింది



గతంలో వర్షాకాలంలో నా భార్య అనారోగ్యానికి గురైతే వైద్యం కోసం చీలపెల్లి మీదుగా సిర్పూర్(టి) తరలించేందుకు ప్రయత్నించాం. కాని వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో దాటలేకపోయాం. సకాలంలో వైద్యం అందకపోవడంతో నా భార్య మృతి చెందింది.

– కొడిపె ముత్త, గ్రామస్తుడు

పట్టించుకునే వారు లేరు



పూసిగూడ గ్రామానికి రోడ్డు వసతి కల్పించేందుకు ఎన్నోసార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నాం. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదు. రోడ్డు వసతి కల్పిస్తామని ఎన్నికల్లో హామీలు ఇవ్వడమే తప్పా ఆచరణలో కానరావడం లేదు. ఇప్పటికైనా రోడ్డు నిర్మాణానికి అనుమతులు ఇచ్చి నిధులు మంజూరు చేయాలి.

– ఆత్రం రాజు, గ్రామస్తుడు

నాయకుల ముందస్తు అరెస్టులు


కౌటాల: పోలీస్‌స్టేషన్‌లో బీజేపీ నాయకులు

చింతలమానెపల్లి: జిల్లా కేంద్రంలో సీఎం కేసీఆర్ సభ్య నేపథ్యంలో మండలంలోని పలువురు నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. శుక్రవారం ఉదయం ఎస్సై విజయ్ కుమార్ ఆధ్వర్యంలో నాయకుల ఇళ్లకు వెళ్లి బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు మోర్లె గణపతి, బీఎస్పీ నాయకులు గోమాసె లాంచు, సిడాం శంకర్, బీజేపీ నాయకులు ఎల్ములె మలయ్య, కాంగ్రెస్ నాయకులు తిరుపతి గౌడ్‌లను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

కౌటాలలో..

కౌటాల: సీఎం కేసీఆర్ జిల్లా పర్యటన సందర్భంగా మండలంలోని బీజేపీ నాయకులను పోలీసులు శుక్రవారం ముందస్తు అరెస్టులు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పార్టీ మండలాధ్యక్షుడు నారులే వాసుపటేల్ మాట్లాడుతూ పోలీసులు బీజేపీ నాయకులను అక్రమంగా అరెస్టులు చేయడం హేయమైన చర్య అన్నారు. కన్నెపల్లి ఎంపీటీసీ సభ్యులు దుర్గం మోతీరాం, పార్టీ జిల్లా కార్యదర్శి బండి రాజేందర్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి మృత్యుంజయ్ కవిరాజ్ పోలీసులు అరెస్టు చేసిన వారిలో ఉన్నారు.

రెబ్బెనలో..

రెబ్బెన: సీఎం కేసీఆర్ జిల్లా పర్యటన నేపథ్యంలో శుక్రవారం మండలంలోని బీజేపీ, సీపీఐ, డీవైఎఫ్ఐ, కాంగ్రెస్ పార్టీల నాయకులతో పాటు హెచ్ఎంఎస్, ఏఐటీయూసీ కార్మిక సంఘాల నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బీజేపీ నాయకులు చక్రపాణి, బాలక్రిష్ణ, నవీన్‌గౌడ్, రాంబాబు, సీపీఐ నాయకులు రవీందర్, సాయికిరణ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు రమేశ్, దేవాజీ, పల్లాస్, ఏఐటీయూసీ నాయకులు ఉపేందర్, హెచ్ఎంఎస్ నాయకులు రాజాబాబు, డీవైఎఫ్ఐ నాయకులు శ్యాంరావు తదితరులు ఉన్నారు.

బెజ్జూర్‌లో..

బెజ్జూర్: జిల్లా కేంద్రానికి సీఎం కేసీఆర్ వస్తున్న సందర్భంగా కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ నాయకులను పోలీసులు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో బీజేపీ మండల అధ్యక్షుడు జాడి దిగంబర్, ప్రధాన కార్యదర్శి ఉమ్మెర బాలకృష్ణ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుస శంకర్ యాదవ్, బీఎస్పీ పార్టీ జిల్లా ఇన్‌చార్జి సోయం చిన్నయ్య, మండల అధ్యక్షుడు ఆత్రం సాయి, నాయకులు సుర్ల ఇస్తారి, ఎస్ఎఫ్ఐ నాయకులు తదితరులు ఉన్నారు.

2న జిల్లా క్రికెట్ టీం ఎంపిక పోటీలు

కాగజ్‌నగర్‌టౌన్: తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 2న పట్టణంలోని ఎస్పీఎం మైదానంలో క్రికెట్ జిల్లా జట్టు ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సలీం, విజయ్ సింగ్‌లు తెలిపారు. అండర్ –19, 25 జట్ల ఎంపిక ఉంటుందన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారుల వయస్సు ధ్రువీకరణ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు తమ వెంట తెచ్చుకోవాలని పేర్కొన్నారు. ఎంపికైన జిల్లా జట్టు జోనల్‌స్థాయి పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు. ఇతర వివరాలకు 95057 35005లో సంప్రదించాలన్నారు.

బస్సులు లేక ప్రయాణికుల తిప్పలు

ఆసిఫాబాద్‌రూరల్: ఆసిఫాబాద్ బస్‌స్టేషన్‌లో బస్సుల్లేక ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. శుక్రవారం ఆసిఫాబాద్‌లో సీఎం సభ నేపథ్యంలో ప్రజలను తరలించేందుకు బస్సులు కేటాయించారు. దీంతో బస్సుల కొరత ఏర్పడింది. ఆసిఫాబాద్ డిపో నుంచి 55 బస్సులు సభకు తరలించారు. మంచిర్యాల్ డిపో నుంచి 80, ఆదిలాబాద్ నుంచి 43, ఉట్నూర్ నుంచి 20 బస్సులు సభకు తరలించడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పలేదు.

సీఎం సభకు తరలిన నాయకులు


దహెగాం నుంచి తరలివెళ్తున్న నాయకులు


కౌటాల: సభకు తరలివెళ్తున్న నాయకులు, ప్రజలు

చింతలమానెపల్లి: జిల్లా కేంద్రంలో నిర్వహించిన సీఎం సభకు శుక్రవారం మండలం నుంచి నాయకులు తరలివెళ్లారు. మండలంలోని ఆయా గ్రామాల నుంచి కార్యకర్తలు, నాయకులు వాహనాల్లో తరలివెళ్లారు. ఎంపీపీ డుబ్బుల నానయ్య, జెడ్పీటీసీ డుబ్బుల శ్రీదేవి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు డుబ్బుల వెంకన్న, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ డోకె రాజన్న, కోఆప్షన్ సభ్యులు నాజిం హుస్సేన్, సర్పంచులు, ఎంపీటీసీలు సభకు హాజరయ్యారు.


చింతలమానెపల్లి: బయలుదేరుతున్న నాయకులు

కౌటాలలో..

కౌటాల: జిల్లా కేంద్రంలో శుక్రవారం జరిగిన సీఎం కేసీఆర్ బహిరంగ సభకు మండలంలోని నాయకులు, ప్రజలు ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు వాహనాలు ఏర్పాటు చేయడంతో మండలంలోని ఆయా గ్రామాల నుంచి మహిళలు, రైతులు సభకు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్, పార్టీ మండలాధ్యక్షుడు ఆదే వసంత్‌రావ్, పార్టీ మండల యూత్ అధ్యక్షులు రవీందర్‌గౌడ్, సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు తరలివెళ్లారు.

దహెగాం: సీఎం కేసీఆర్ శుక్రవారం ఆసిఫాబాద్ జిల్లాకు వచ్చిన నేపథ్యంలో మండలం నుంచి బీఆర్ఎస్ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. బస్సులతో పాటు ప్రైవేట్ వాహనాల్లో పెద్దఎత్తున ప్రజలు తరలివెళ్లారు.

సీఎం సార్‌కు ఘన స్వాగతం

జిల్లా కేంద్రంలో సీఎం కేసీఆర్‌కు శుక్రవారం ఘన స్వాగతం లభించింది. సీఎం సభకు జనం భారీగా తరలిరావడంతో జిల్లాకేంద్రంలోని రహదారులు జనసంద్రమయ్యాయి. సభా ప్రాంగణం సరిపోక ఎక్కడికక్కడ ప్రజలు 2గంటల పాటు నిల్చొని కార్యక్రమం వీక్షించారు. ఈసందర్భంగా కళాకారులు ఆటపాటలతో అలరించారు. పోలీసులు జిల్లాకేంద్రంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

– ఆసిఫాబాద్/ఆసిఫాబాద్‌రూరల్/ఆసిఫాబాద్‌అర్బన్


కలెక్టరేట్‌లో వేదపండితులతో పూజలు


కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర, జిల్లా అధికారులు


సీఎంకు ఫొటో అందజేస్తున్న జెడ్పీటీసీ నాగేశ్వర్‌రావు


చెక్‌పోస్టు నుంచి నడకతో సభకు వస్తున్న ప్రజలు


గుమ్మడి కాయతో దిష్టి తీస్తున్న మంత్రి ప్రశాంత్ రెడ్డి


పాటలతో అలరిస్తున్న సింగర్ మధుప్రియ


ఎస్పీ కార్యాలయం వద్ద గౌరవ వందనం స్వీకరిస్తున్న సీఎం కేసీఆర్


ఎస్పీ కుటుంబ సభ్యులతో సీఎం కేసీఆర్

ఉద్యోగులకు సన్మానం


ఉద్యోగులను సన్మానిస్తున్న అధికారులు

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలోని కైరిగూడ ఓసీపీతోపాటు గోలేటి సీహెచ్‌పీలో శుక్రవారం ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులను అధికారులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కైరిగూడ ఓసీపీలో 35 సంవత్సరాల సర్వీసు పూర్తి చేసుకుని ఉద్యోగ విరమణ పొందుతున్న ఈపీ ఆపరేటర్ భీమగోపాల్, జి.ప్రభాకర్ దంపతులను గని మేనేజర్ ప్రవీణ్ ఫాటింగ్, సేఫ్టీ అధికారి రాజేశ్వర్‌కు ఘనంగా వీడ్కోలు పలికారు. అలాగే కైరిగూడ ఓసీపీలో కన్వేయర్ ఆపరేటర్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందుతున్న చంద్రి పెంటయ్యను సీహెచ్‌పీ డీజీఎం భీంరావ్ జాడే సన్మానించి బహుమతులు అందించారు. కార్యక్రమాల్లో టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, వెల్ఫేర్ ఆఫీసర్ వేణు, ఈఈ రాజు టీబీజీకేఎస్ నాయకులు రమేశ్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

పోడు పట్టాల సంబురం

బోథ్: ఆసిఫాబాద్‌లో గిరిజనులకు సీఎం కేసీఆర్ పోడు పట్టాలు పంపిణీ చేయడంతో ఆదివాసీలు సంతోషం వ్యక్తం చేశారు. సొనాల గ్రామంలో ఐటీడీఏ డైరెక్టర్ మెస్రం భూమన్న ఆదివాసీలకు స్వీట్లు పంచిపెట్టారు.